క్లుప్తంగా

రహదారిని బాగు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): జొహరాపురం నుంచి వెంకాయపల్లెకు వెళ్లే రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులను తీర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. పూర్తిగా దెబ్బతిన్న రహదారిని సీపీఎం నాయకులు సోమవారం పరిశీలించారు. మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. నాయకులు మద్దయ్య, షెక్షా, షఫీ పాల్గొన్నారు.

వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశువు మరణానికి కారణమైన సూపరింటెండెంట్ డాక్టర్ కె.మైత్రేయిపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఏవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో అక్తర్‌బేగం కుటుంబ సభ్యులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. డాక్టర్ మేత్రేయి ఆసుపత్రి విధులకు డుమ్మాకొట్టి సొంత క్లినిక్‌కే పరిమితం కావడంతో చికిత్స కోసం వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రెండు రోజుల క్రితం పురిటి నొప్పులతో అక్తర్‌బేగం అనే మహిళ ఆసుపత్రికి రాగా సమయానికి కాన్పు చేయక బిడ్డ చనిపోయిందన్నారు. అక్తర్‌బేగంకు కడుపుకోత మిగిల్చిన వైద్యురాలుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమాజ సేవ అలవర్చుకోవాలి

కర్నూలు(సెంట్రల్): విద్యార్థులు సమాజ సేవను అలవర్చుకోవాలని సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కో–కన్వీనర్ జె.రంగస్వామి సూచించారు. సోమవారం సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ శౌరీల్‌రెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ డాక్టర్ శంకర్‌శర్మ చేతులమీదుగా బహుమతులను అందజేశారు.

రేపు వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 14న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి షెక్షావలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగంలో బాలబాలికలు, సీనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటి ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30వ తేదీ నుండి సెప్టెంబర్ 1వ తేదీ వరకు అనకాపల్లిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 98492 49357 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ప్రోగ్రామింగ్ స్కిల్స్ పెంచుకోవాలి

కర్నూలు(సెంట్రల్): బీటెక్ విద్యార్థులు ప్రోగ్రామింగ్ స్కిల్స్ పెంపొందించుకుంటే ఉద్యోగాలు వాటంతటే అవే వస్తాయని రవీంద్ర విద్యాసంస్థల గౌరవ సలహాదారు డాక్టర్ ఈఎస్ చక్రవర్తి, ఆ విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య పేర్కొన్నారు. సోమవారం జి.పుల్లయ్య, రవీంద్ర ఇంజినీరింగ్ కళాశాలల ఓరియేంటేషన్ డే వేడుకలను కళాశాలల చైర్మన్ మోహన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. అతిథులు మాట్లాడుతూ.. బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్, డ్రోన్ టెక్నాలజీపై పట్టు పెంచుకుంటే ఉద్యోగావకాశాలు అనేకం ఉన్నాయన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక ప్రోత్సాహం

కర్నూలు (టౌన్): ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో కర్నూలు నగరానికి చెందిన విశ్వాసరావు ప్రతిభ చాటారు. దీంతో సోమవారం సాయంత్రం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ తన చాంబర్‌లో తైక్వాండో క్రీడాకారుడికి ఆర్థిక ప్రోత్సాహం అందించి అభినందించారు. శిక్షకులు వెంకటేష్ ఉన్నారు.

వేతన బకాయిలకై ధర్నా

కర్నూలు(సెంట్రల్): పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శానిటేషన్ సిబ్బంది ధర్నాకు దిగారు.

జెండా పండుగకు ఆహ్వానం

కర్నూలు(అర్బన్): స్థానిక సీ క్యాంప్‌లోని కార్యాలయంలో ఈ నెల 15న నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ కార్యక్రమానికి సీఏపీఎఫ్ జవాన్లందరు హాజరు కావాలని ఆల్ ఇండియా సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌బీ రంగయ్య, జీ శేషిరెడ్డి కోరారు. ఈ అసోసియేషన్‌లో సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, అస్సామ్ రైఫిల్స్‌లో విధులు నిర్వహించి రిటైర్డు అయిన వారందరు సభ్యులని పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు జెండా వందనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్మికుల పొట్టకొట్టి.. పేదలపై పెను భారం

- ఇంటింటికీ రేషన్ పంపిణీకి సర్కారు మంగళం
- వాహనాలను తొలగిస్తే రోడ్డున పడతామంటున్న ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు
- రేషన్ దుకాణాల ముందు లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సిందే
- గత ప్రభుత్వంలో కేఎంసీ పరిధిలో 67 వాహనాలతో నిత్యావసర సరుకుల సరఫరా
- 1.12 లక్షల కార్డుదారులకు బియ్యం, సరుకులు డోర్ డెలివరీ



చౌరస్తాలో వాహనం వద్ద రేషన్ వేయించుకుంటున్న ప్రజలు

కర్నూలు(సెంట్రల్): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా నిరు పేదలకు ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందించాలనే సదుద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకు ప్రతి మండలానికి, పట్టణాలకు ప్రత్యేకంగా వాహనాలను కేటాయించారు. మారుమూల గ్రామాలకు సైతం వెళ్లి సకాలంలో ప్రజల ఇంటి వద్దనే సరుకులు అందించారు. రేషన్ పంపిణీలో భాగంగా మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లు (వాహన డ్రైవర్లు), హెల్పర్లను నియమించి వారికి ఉపాధి కల్పించారు.

ప్రస్తుతం సీఎం చంద్రబాబునాయుడు రేషన్ వాహనాలను తొలగించాలని నిర్ణయించడంతో ఎండీయూ ఆపరేటర్లు, హెల్పర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. మరోవైపు రేషన్ సరుకుల కోసం మళ్లీ చౌక దుకాణాల వద్ద రోజంతా పడిగాపులు కాయాల్సిందేనా అని లబ్ధిదారులు వాపోతున్నారు. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే రేషన్ సరుకులు వస్తుండడంతో ఎంతో సౌకర్యంగా ఉండేదని ఇప్పుడు మళ్లీ పనులు మానుకుని రేషన్ షాపులకు వెళ్లి బియ్యం తెచ్చుకోవాలంటే ఎన్నో వ్యయప్రయాసలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం మార్చుకుని ఇంటి వద్దకే రేషన్ అందించాలని కోరుతున్నారు.

దాదాపు మూడేళ్లుగా డోర్ డెలివరీ

కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో కర్నూలు నియోజకవర్గంలో 33, పాణ్యంలో 16, కోడుమూరులో 3 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల పరిధిలో 1.20 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. ఆయా కార్డుల్లో దాదాపు 4 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీదరందరికీ 2021 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు డోర్ డెలివరీ ద్వారా అందుతున్నాయి. అయితే కొన్ని వార్డుల్లో ఇరుకు సందులు ఉండడంతో అక్కడికి వాహనాలు వెళ్లలేకపోతున్నాయి. దీంతో ఆ వార్డు సమీపంలోకి వాహనాలు వెళితే ప్రజలు వచ్చి రేషన్ సరుకులను తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేయడం లేదు కదా అని చంద్రబాబు నాయుడు ఆ వ్యవస్థనే తొలగించాలని చూడడం అన్యాయమని నగర ప్రజలు మండిపడుతున్నారు.

అగమ్య గోచరంగా ఆపరేటర్, హెల్పర్ల పరిస్థితి

కర్నూలు నగరంలో మొత్తం 67 మంది ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేస్తున్నారు. ఒక్కో వాహనానికి డోర్ డెలివరీ కోసం ఆపరేటర్, హెల్పర్ ఉంటారు. వీరికి నెలలో సగం రోజులకు ఆపరేటర్‌కు రూ.10 వేలు, హెల్పర్‌కు రూ.5 వేలు వేతనం అందుతుంది. దాదాపు మూడేళ్లుగా ఆ వాహనాలను నమ్ముకొనే ఆపరేటర్, హెల్పర్ జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు ఉన్నట్లుండి తొలగిస్తే వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. ప్రభుత్వం రేషన్‌బండ్ల తొలగింపుపై పునరాలోచన చేయాలని ప్రజలు, ఎండీయూ ఆపరేటర్లు కోరుతున్నారు.

ఇంటి దగ్గరకే వాహనాలు వస్తున్నాయి



వాహనాలు లేని సమయంలో రేషన్ షాపు వద్దకు వెళ్లాలంటే దాదాపు కిలోమీటరున్నర నడిచి వెళ్లాల్సి ఉండేది. వాహనాలు వచ్చాక ఇంటి దగ్గరకే సరుకులు తెచ్చి అందిస్తున్నారు. బియ్యం, బ్యాళ్లు, చక్కెర కోటా ప్రకారం ఇస్తున్నారు. వాహనాలతో ఎంతో సౌకర్యంగా ఉంది. వాహనాలు వచ్చే సమయాన్ని ముందుగానే తెలియజేస్తుండడంతో ఆ సమయంలో ఉండి సరుకులు తీసుకుంటున్నాం.

– అనసూయ, గురుబ్రహ్మనగర్, కర్నూలు

హెల్పర్‌గా జీవనం సాగిస్తున్నా



నేను 15 రోజులు ఎండీయూ వాహనం హెల్పర్‌గా పని చేస్తున్నా. మిగిలిన 15 రోజులు కూలీ పనికి వెళ్తున్నాను. హెల్పర్‌గా వచ్చే వేతనం నా కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటోంది. పేదలకు మేలు చేయకపోయినా పర్వాలేదు కానీ కీడు చేయరాదు. వాహనాలను తొలగిస్తే నాలాంటి వాళ్లు ఎంతో మంది రోడ్డున పడతారు. ప్రభుత్వం మరోసారి ఆలోచన చేయాలి.

– మద్దిలేటి, బళ్లారిచౌరస్తా, కర్నూలు

మా బతుకుల మాటేమిటి బాబూ



ఎండీయూ వాహనం ద్వారా పేదల ఇళ్లకే సరుకులు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. వాటి ద్వారానే మేము కూడా జీవనం సాగిస్తున్నాం. నెలకు రూ.10 వేల వరకు ఆదాయం వస్తోంది. బండి కంతులు, పెట్రోలు, ఇతర అలవెన్స్‌లకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చూస్తోంది. ఎంతో సాఫీగా సాగిపోతున్న తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎండీయూ వాహనాలను రద్దు చేస్తానని చెప్పడం బాధేసింది. వాహనాలను రద్దు చేస్తే మేము ఎలా బతకాలి. ప్రభుత్వం మరోసారి పునరాలోచన చేయాలి.

– సి.వీరేష్, వన్‌టౌన్ ఏరియా, కర్నూలు

వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటు

కర్నూలు(అగ్రికల్చర్): ఆహార పోషకాల భద్రత కింద (ఎఫ్ఎన్ఎస్) కింద వివిధ పంటలకు సంబంధించి క్లస్టర్ డెమాన్‌స్ట్రేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన నిధులను కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భరిస్తోంది. పప్పుదినుసుల పంటల్లో 39, పత్తిలో 57, చిరుధాన్యాల పంటల్లో 37 ప్రకారం ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయడానికి అనుమతి లభించింది. ఒక క్లస్టర్‌లో చిరుధాన్యాలు, పప్పు దినుసుల పంటల్లో 20 హెక్టార్లు, పత్తిలో మాత్రం 10 హెక్టార్లు ఉంటుంది. పత్తికి హెక్టారుకు రూ.8 వేలు, చిరుధాన్యాల పంటకు రూ.6 వేలు, పప్పుదినుసులకు రూ.9 వేల విలువగల ఇన్‌పుట్స్ లభిస్తాయి. ఎఫ్ఎన్ఎస్ కింద జిల్లాకు రూ.1.96 కోట్లు మంజూరయ్యాయి. ఎన్ఎంఈఓ కింద జిల్లాకు రూ.26.20 లక్షలు మంజూరయ్యాయి. ఎన్ఎంఈఓ కింద వేరుశనగలో 10, ప్రొద్దుతిరుగుడులో 4, ఆముదంలో 5 ప్రకారం ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. వేరుశనగకు హెక్టారుకు రూ.10 వేలు, ప్రొద్దుతిరుగుడుకు రూ.4 వేలు, ఆముదం పంటలకు రూ.3 వేలు ప్రకారం ఇన్‌పుట్స్ ఇస్తారు. అంతేగాక 60 వేల మీటర్ల వాటర్ క్యారియింగ్ పైపులు సబ్సిడీపై సరఫరా కానున్నాయి. మీటరుకు 50 శాతం లేదా రూ.50 ఇందులో ఏది తక్కువైతే దానిని సబ్సిడీగా ఇస్తారు.

నేడు ఏపీఎస్‌పీడీసీఎల్ సీఎండీ రాక

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ సదరం పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీఎస్‌పీడీసీఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కే.సంతోష్‌రావు మంగళవారం కర్నూలుకు రానున్నారు. ఆయన వెంట సీజీఎం (రెవెన్యూ) ధర్మజ్ఞాని, సీజీఎం (ఓఅండ్ఎం) ఆర్.పద్మ ఉంటారు. కొత్త బస్టాండు సమీపంలోని విద్యుత్ భవన్‌లో ఈఈలు, డీఈలు, ఏడీలు, ఏఈలతో నిర్వహించే సమీక్ష సమావేశంలో సీఎండీ పాల్గొంటారు. 2024–25 సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చిస్తారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణారోగ్యం



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, డీఆర్వో కె.మధుసూదన్, డీఎంహెచ్‌ఓ భాస్కర్

కర్నూలు(సెంట్రల్): నులిపురుగులను నివారించడం ద్వారా చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దవచ్చని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా నులిపురుగుల నిరవాణపై అవగాహన కోసం రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఏటా ఫిబ్రవరి 10, ఆగస్టు 10 తేదీల్లో పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు భోజనం తరువాత సగం, 3 నుంచి 19 సంవత్సరాల విద్యార్థులకు భోజనం తరువాత ఒక మాత్రను వేయవచ్చన్నారు. ఈ మాత్రలను తీసుకోవడం ద్వారా బాలల్లో రక్తహీనత నివారించబడి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కాగా, ఆగస్టు 10వ తేదీన ఏదైనా కారణాలతో మాత్రలు తీసుకోకపోతే ఆగస్టు 20, 28వ తేదీల్లో పొందేందుకు వీలు ఉందన్నారు. డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ భాస్కర్, ఆర్‌బీఎస్కే కో–ఆర్డినేటర్ డాక్టర్ హేమలత, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

- జిల్లాలో హెచ్ఐవీ/ ఎయిడ్స్ ప్రచార కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. ఎయిడ్స్ ప్రచార కార్యక్రామనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆగస్టు 12వ తేదీన అంతర్జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా 8 వారాలపాటు ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ భాస్కర్ పాల్గొన్నారు.
- జిల్లాలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగుర వేసేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా తిరంగా కాన్వాస్ మీద కలెక్టర్ సంతకం చేశారు. ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి ఫొటో తీసుకొని www.harghartiranga.com అనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి సర్టిఫికెట్‌ను పొందవచ్చని సూచించారు. టూరిజం అధికారి, విజయ, సెట్కూరు సీఈఓ రమణ పాల్గొన్నారు.
- యువత మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సూచించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్ అభియాన్' ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, జిల్లా స్థాయి అధికారులు వీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని నిషా ముక్త్ భారత్ అభియాన్, విక్షిత్ భారత్ కామంత్ర, భారత్ హో నషే సే స్వతంత్ర అనే కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. మాదకద్రవ్యాలతో ఆరోగ్యం దెబ్బతిని మానసిక ప్రశాంతతను కోల్పోతారని, తద్వారా దేశం యువశక్తిని కోల్పోతుందన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, అవగాహన కోసం పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం అధికారులు మాదక ద్రవ్యాల నిర్మూలనకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాదు, అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోరాడుదాం



ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న నగర పాలక కమిషనర్ రామలింగేశ్వర్



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న రెండవ పట్టణ పోలీసులు

కర్నూలు (టౌన్): మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం, పోలీసులు చేస్తున్న పోరాటంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని నగరపాలక కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత మంత్రిత్వ శాఖ చేపట్టిన నశా విముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక నగర పాలకలోని తన చాంబర్‌లో కమిషనర్ ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత, డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల రొంపిలో దిగితే ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతను నాశనం చేస్తాయన్నారు. వాటికి దూరంగా ఉండాలన్నారు. మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్లు ప్రసాద్‌గౌడ్, మన్సూర్ బాష, ఆర్‌ఓ జునీద్, ఆర్‌ఐలు శ్రీకాంత్, సాధిక్ పాల్గొన్నారు.

కర్నూలు: డ్రగ్స్ నిర్మూలనలో ప్రతిఒక్కరు భాగస్వాములై భావితరాలకు మంచి భవిష్యత్తు అందించాలని ఎస్పీ బింధుమాదవ్ పిలుపునిచ్చారు. యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి భవిష్యత్తును మంచి వైపు వెళ్లేలా నడుచుకోవాలని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో పోలీసు స్టేషన్ల వారీగా ఎస్‌హెచ్‌ఓలు పోలీసు సిబ్బంది ఈ మేరకు ప్రతిజ్ఞ చేయించారు.

ఉద్యోగం పేరుతో మోసం



ఫిర్యాదులను వింటున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు: ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఎమ్మిగ నూరు పట్టణానికి చెందిన గిడ్డయ్య రూ.1.50 లక్ష లు తీసుకొని మోసం చేశాడని, తిరిగి డబ్బులు ఇవ్వాలని అడిగితే, ప్రామిసరీ నోటు రాసిస్తానని బెదిరిస్తున్నాడని ఎస్పీ బిందు మాధవ్‌కు కర్నూ లు ప్రకాష్‌నగర్‌కు చెందిన ప్రకాష్ ఫిర్యాదు చేశా రు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదు ల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజ ల నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో ఎస్పీ మాట్లాడారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 115 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్టపరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐలు శివశంకర్, హాజీవలి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలో అధ్వానంగా ఉన్న రహదారులకు మరమ్మతులు, డ్రైనేజీ కాల్వల నిర్మాణ పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కమిషనర్ స్వీకరించారు. 21 మంది అర్జీలను అందజేశారు. ఎంఈ షాకీర్, డీసీపీ సంధ్యారాణి, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్‌ఓలు జునీద్, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే..

- జొహరాపురం వద్ద సీసీ రోడ్డు పనులు చేపట్టాలని మాజీ కార్పొరేటర్ తిమోతి విన్నవించారు.
- పోస్టల్ కాలనీ, టెలికాం కాలనీ ప్రధాన రహదారి వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రామనాయుడు విన్నవించారు.
- మెటల్ రోడ్డు వేయాలని వెంకటాద్రినగర్‌కు చెందిన పరమేష్‌రెడ్డి కోరారు.
- సీసీ డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని కల్లూరు ఎస్టేట్, చింతలముని నగర్ కాలనీకి చెందిన హనుమంతు అభ్యర్థించారు.

దేశాభివృద్ధికి పాటుపడాలి

కర్నూలు(హాస్పిటల్): డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించుకుని యువత దేశాభివృద్ధికి పాటుపడాలని, సెట్కూరు సీఈఓ పీవీ రమణ చెప్పారు. సెట్కూరు–యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. అనంతరం వక్తృత్వ పోటీల విజేతలు సయిదా ఫాసిహా, ఆర్.మయాంక్, డి.వసంత దీపికాలకు జ్ఞాపికలను అందజేశారు.కళాశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

అవయవదానం.. పునర్జన్మనిచ్చే వరం



అవయవదానం గురించి తెలిపే చిత్రం

కర్నూలు(హాస్పిటల్): అవయవదానంపై ఎన్నో అనుమానాలు, అపోహలు ప్రజల్లో వేళ్లూనుకొని పోయాయి. దీంతో అవయవదానం చేసేందుకు పలువురు వెనకంజ వేస్తున్నారు. మనిషి మరణించాక మాత్రమే, అది కూడా బ్రెయిన్ డెడ్ దశలో ఉండగా మాత్రమే అవయవయాలను సేకరిస్తారని, తద్వారా మరో 8 మందికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని చాలామందికి తెలియదు. దీనిపై అవగాహన ఉన్న వారు మాత్రమే అవయవదానం చేసేందుకు ముందుకొస్తున్నారు. ఇలాంటి వారిని ప్రభుత్వం మరింతగా ప్రోత్సహించాల్సి ఉంది. ఇందుకోసం ఏటా ఆగస్టు 13న ప్రపంచ అవయవదాన దినోత్సవం నిర్వహిస్తున్నారు.

జీవన్‌దాన్ ట్రస్ట్ ద్వారా అవగాహన

అవయవదానం చేయడానికి వయస్సుతో పనిలేదు. ఎవరైనా చేయొచ్చు. అవయవదానాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా జీవన్‌దాన్ అనే సంస్థను ఏర్పాటు చేసింది. వైద్యనిపుణుల పర్యవేక్షణలో ఈ సంస్థ పనిచేస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తుల సమాచారాన్ని ఈ ట్రస్ట్‌కు అందిస్తే వారు అవయవాలను సేకరించి అవసరం ఉన్న రోగులకు అమరుస్తారు. అయితే అవయవాలు కావాల్సి వస్తే ముందుగా ఈ ట్రస్ట్‌లో పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రాధాన్యత క్రమాన్ని బట్టి సేకరించిన అవయవాలను నిపుణుల పర్యవేక్షణలో అవసరమైన వారికి అమరుస్తారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనూ జీవన్‌దాన్ ట్రస్ట్ ప్రతినిధిని ఏర్పాటు చేశారు. వీరు ఎవరైనా బ్రెయిన్‌డెడ్ అయితే వారి కుటుంబసభ్యులను కలుస్తారు. అన్ని విషయాలను వారికి వివరిస్తారు. వారి అనుమతితో అవయవాలను సేకరించి ఇతర రోగులకు అమర్చే ఏర్పాటు చేస్తారు.

కొందరు వ్యక్తులకు జన్మతః, పలు రకాల జబ్బుల కారణంగా అవయవాలు దెబ్బతింటాయి. అలాంటి వారికి దెబ్బతిన్న అవయవం స్థానంలో ఇతరుల అవయవం అమరిస్తే వారు మళ్లీ జీవించినట్లు అవుతుంది. అంధులుగా పుట్టేవారికి దాతల నుంచి సేకరించిన నేత్రాలను అమర్చితే వారు మళ్లీ ఈ లోకాన్ని చూడగలుగుతారు. చనిపోతూ నలుగురికి ప్రాణం పోయగలగడం మనిషికి దక్కిన వరం. ఆ లెక్కన అవయవదానం గొప్పకార్యం.

ఒకరి అవయవాలతో 8 మందికి పునర్జన్మ

ఒక వ్యక్తి నుంచి పలు రకాల అవయవాలను ఇతరులకు దానం చేసే వీలుంది. ఇందులో గుండె, మూత్రపిండాలు, పాంక్రియాస్ (క్లోమగ్రంధి), ఊపిరితిత్తులు, కాలేయం, పేగులు, చర్మం టిష్యూ, చేతులు, ముఖం, స్టెమ్ సెల్స్, కళ్లు, ఎముకలో మూలిగను ఇతరులకు అమర్చవచ్చు. కాగా కిడ్నీ, కాలేయ మార్పిడి, ఎముక మజ్జను బతికుండగానే దగ్గరి వారి కోసం దానం చేయవచ్చు. ఇక బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి వారి కుటుంబసభ్యుల సమ్మతితో ఇతర అవయవాలను సేకరిస్తుంటారు. వీటి సాయంతో మరో 8 మంది ప్రాణాలు కాపాడే వీలుంది.

రెడ్‌క్రాస్ ద్వారా అవగాహన కార్యక్రమాలు



అవయవదానంపై పదేళ్ల నుంచి రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు వెయ్యి మంది ఒప్పించి అంగీకార పత్రాలు సేకరించాం. ఇందులో మెడికల్ రెప్రజెంటేటివ్స్, చిరంజీవి, పవన్‌కళ్యాణ్ అభిమానులు, వెల్దుర్తి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉన్నారు. అలాగే నేత్రదాన కార్యక్రమాన్ని 2005 నుంచే ప్రారంభించి ఇప్పటివరకు 600 మంది నేత్రాలను సేకరించాం. ఇటీవల అవయవాలను దానం చేసిన పావనీలత కుమార్తెను స్కంద సంస్థల అధినేత సురేష్‌రెడ్డి చదివిస్తున్నారు. ఆ బాలికకు ప్రభుత్వం రూ.6 లక్షలు, దాతలు రూ.6 లక్షలు ఇవ్వడంతో మొత్తం రూ.12 లక్షలను పాప పేరుతో బ్యాంకులో డిపాజిట్ చేశాం.

–డాక్టర్ కేజీ.గోవిందరెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్, కర్నూలు



మాట్లాడుతున్న యాంకర్ సుమ



డ్యాన్స్ అదుర్స్.. స్టెప్పులేస్తున్న కళాకారులు



'మిస్టర్ బచ్చన్' లడ్డూ లాంటి సినిమా



హీరోయిన్ భాగ్య శ్రీ బోర్సే

కర్నూలు కల్చరల్: ''మిస్టర్ బచ్చన్' సినిమా ప్రతి బ్లాక్ కలర్‌ఫుల్‌గా, అందంగా, లడ్డూలా ఉంటుంది' అని మాస్ మహరాజ్ రవితేజ అన్నారు. కర్నూలులో 'మిస్టర్ బచ్చన్ సినిమా' ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. రవితేజ మాట్లాడుతూ సినిమా 15న విడుదల చేస్తామన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్ టికెట్స్ ఓపెన్ అయ్యాయని, బ్లాక్ బస్టర్ హిట్‌ను అందిస్తారనుకుంటున్నామని దర్శకులు హరీశ్ శంకర్ అన్నారు. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే సినిమాలోని నల్లంచు తెల్లచీర పాటకు స్టెప్పులేశారు. బ్లాక్ బస్టర్ సినిమాలో అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాణ్యం, ఆదోని ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, పార్థసారథి, సినీ నిర్మాత టి.జి.విశ్వప్రసాద్, మాజీ ఎంపీ టి.జి.వెంకటేష్, సంగీత దర్శకులు మిక్కీ జే మేయర్, కొరియోగ్రాఫర్ బాను, స్టంట్ మాస్టర్ పృథ్వి, సినిమా యూనిట్ పాల్గొన్నారు.



మాస్ మహరాజ్, హీరో రవితేజ